సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 6 । అక్టోబర్ । 2025



ఆర్టీసీ ప్రయాణికుల పాట్లు

దసరా అనంతరం తిరిగి వెళ్తున్న ప్రయాణికులతో బస్టాండ్లు కిటకిటలాడుతున్నాయి. ఇల్లెందులో ఆదివారం రోజంతా రద్దీ కనిపించింది. 8లో



చేరువగా 'కేంద్రీయ' విద్య

జిల్లాకు కేంద్రీయ విద్యాలయం మంజూరు కాగా పిల్లలకు ఉన్నతమైన, నాణ్యమైన విద్య అందే అవకాశం ఉంటుంది. 8లో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం
32° / 24°

జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం వేళ వర్షం కురిసే అవకాశం ఉంది.

ఆశలు ఆవరి

వరి పైరును ఆశించిన ఎండాకు తెగులు

- నిలువునా ఎండుతుండగా అన్నదాతల్లో ఆందోళన
- ఎన్ని మందులు చల్లినా కనిపించని ఫలితం



తెగుళ్లతో నిలువునా ఎండిపోతున్న వరిపైరు

బూర్గంపాడు: పొట్టదశలో ఉన్న వరి పైరు తెగుళ్లతో నిలువునా ఎండిపోతోంది. పంట చేతికొచ్చే సమయంలో ఎండాకు తెగుళ్లు అన్నదాతలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. చీడపీడల నివారణకు ఎన్ని సస్యరక్షణ చర్యలు చేపట్టినా ఫలితం కనిపించడం లేదు. తెగుళ్ల ఉధృతి రోజురోజుకూ పెరుగుతుండడం రైతులను మరింతగా కలవరపెడుతోంది. ఇప్పటికే నాలుగు సార్లు పురుగుమందులు పిచికారీ చేసినా ప్రయోజనం లేదని రైతులు వాపోతున్నారు.

బోనస్ వస్తుందనే ఆశతో..

సన్నరకం ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించటంతో రైతులు సన్నరకం వరి సాగుకే మొగ్గుచూపారు. అయితే సన్నరకం వరికి చీడపీడలు, దోమ, పురుగు బెడద ఎక్కువగా ఉంటుంది. దొడ్డు రకం వరిసాగుకు, సన్నరకం వరి సాగుకు మధ్య ఎకరాకు రూ.5వేల వరకు పెట్టుబడుల్లో వ్యత్యాసం ఉంటుంది. ప్రభుత్వం బోనస్ ఇస్తామని ప్రకటించటంతో రైతులు ఆ ఆశతో సన్నరకం వరిసాగుకు మొగ్గుచూపారు. జిల్లాలో మూడొంతుల మేర రైతులు సన్నరకం వరినే సాగు చేశారు.

వివిధ దశల్లో పంట

జిల్లాలోని పలు మండలాల్లో ప్రస్తుతం వరిపైరు పొట్ట, చిరు పొట్ట, కంకి వచ్చే దశలో, గింజ పాలుపోసుకునే దశలో ఉన్నాయి. ఈ తరుణంలో అగ్గితెగులు, తాటాకు తెగులు, ఎండాకు తెగులు పంటను ఆశించి తీవ్రంగా నష్టపరుస్తున్నాయి. వరి ఆకుల్లోని పత్రహరితం మొత్తం మాడిపోయి పైరు నిలువునా ఎండిపోతోంది. ముదురు, లేత అదునులలో సాగు చేసిన వరిపైరు మొత్తానికి కూడా తెగుళ్లు ఆశిస్తున్నాయి. తెగుళ్ల నివారణకు రైతులు ఇప్పటికే మూడు, నాలుగుసార్లు మందులు పిచికారీ చేశారు. అయినా పెద్దగా మార్పు రాలేదని నిరాశకు గురవుతున్నారు. పంట దిగుబడిపై తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పరిశీలించి తమకు తగు సలహాలు, సూచనలు అందించాలని కోరుతున్నారు.

1.80 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలో ఈ ఏడాది సుమారు 1.80 లక్షల ఎకరాల్లో వరిపంట సాగు చేశారు. ఈ ఏడాది వర్షాలు ఎక్కువగా కురుస్తుండడంతో పంట ఏపుగా పెరిగింది. జిల్లా వ్యాప్తంగా ఇటీవలి వరకు ఆశాజనకంగానే ఉండగా.. గత పదిహేను రోజుల నుంచి వరిపైరు చివరి కొనలు ఎండిపోతున్నాయి. ఆకుల చివరి నుంచి ఎండు కుంటు వస్తోంది. తొలుత కొద్దిగానే కనిపించిన తెగుళ్లు రోజుల వ్యవధిలోనే పొలం మొత్తం విస్తరిస్తోంది. అధిక వర్షాల కారణంగానే ఈ తెగుళ్ల ఉధృతి పెరిగిందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే మూడు, నాలుగు సార్లు రసాయనిక మందులు పిచికారీ చేసినా పెద్దగా మార్పేమీ లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూడుసార్లు మందులు కొట్టా..

వరి పొట్టకు వచ్చేటప్పుడు ఎండాకు తెగులు బాగా పెరిగిపోతోంది. ఈ తెగులు కనిపించిన వెంటనే మందులు కొట్టినా పెద్దగా ఫలితం కనిపించడం లేదు. దిగుబడి తగ్గిపోతుందని భయంగా ఉంది. పంట చేతికొచ్చే వరకు నమ్మకం లేకుండా పోతోంది.

– మారం శ్రీనివాసరెడ్డి, రైతు, సంజీవరెడ్డిపాలెం

వాతావరణ పరిస్థితులే కారణం

వర్షాలు ఎక్కువగా పడుతుండడంతో తెగుళ్ల ఉధృతి పెరుగుతోంది. ప్రస్తుత వాతావరణం తెగుళ్లకు అనుకూలంగా ఉంది. నివారణకు రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. కాపర్ ఆక్సీక్లోరైడ్, ప్లాంటమైసిన్, నాటివో వంటి ఫంగిసైడ్స్ పిచికారీ చేసుకోవాలి. తెగుళ్లు వచ్చిన పైరు క్రమేపీ కోలుకుంటుంది. తెగుళ్లు రాని పైరుకు కూడా ముందస్తుగా మందులు పనిచేస్తాయి.

– శంకర్, మండల వ్యవసాయశాఖ అధికారి, బూర్గంపాడు

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) అమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అమ్మవారికి ఒడిబియ్యం, పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి రద్దు

సూపర్‌బజార్(కొత్తగూడెం): అధికారులు జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో నిమగ్నమై ఉన్నందున.. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ వినతిపత్రాలు, దరఖాస్తులు, ఫిర్యాదులను కలెక్టరేట్‌లోని ఈ వార్డ్ విభాగంలో అందజేయాలని సూచించారు. ఆయా అర్జీలను పరిష్కారం కోసం సంబంధిత విభాగాలకు పంపిస్తామని పేర్కొన్నారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

ఒకరోజు ఆదాయం రూ.44,290

పాల్వంచరూరల్ : పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకుల సందడి కనిపించింది. జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా అధిక సంఖ్యలో తరలివచ్చి డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 518 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.27,440, 280 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.16,850 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

జేకే ఓసీ ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నాం

ఇల్లెందు : నూతన జేకే ఓసీ ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నామని సింగరేణి డైరెక్టర్(పీఅండ్‌పీ) కె.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఆయన ఇల్లెందు ఏరియాలో పర్యటించారు. అనంతరం జీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. ఓసీ ఏర్పాటుకు గల అడ్డంకులు తొలగిపోయేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాలను అధిగమించాలని, రవాణాకు ఎలాంటి ఆటంకం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఉపరితల గనుల్లో ఉద్యోగులు రక్షణ పరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఏరియా ఆస్పత్రిని సందర్శించి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో జీఎం వీసం కృష్ణయ్య, ఎస్‌ఓటు జీఎం రామస్వామి, అధికారులు నరసింహరాజు, గిరిధర్‌రావు, జాకీర్ హుస్సేన్, తుకారం, రామ్మూర్తి, శివ వీరకుమార్, శివప్రసాద్, సతీష్ కుమార్, వెంకటేశం, రత్నం, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆధార్ సేవల చార్జీలను ప్రదర్శించాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) ఆధార్ సేవలపై సవరించిన కొత్త చార్జీలు అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వచ్చాయని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు ఈ మార్పులపై పూర్తి అవగాహన కల్పించేలా అన్ని ఆధార్ సేవా కేంద్రాల్లో కొత్త చార్జీల వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు. బయోమెట్రిక్ అప్‌డేట్(ఫింగర్ ప్రింట్, ఐరిస్, ఫొటో) కోసం చార్జీల వివరాలను వెల్లడించారు. 5 –7, 15 – 17 సంవత్సరాల పిల్లలకు ఒకసారి ఉచితమని, మిగతా సందర్భాల్లో రూ.125 చార్జీ అవుతుందని తెలిపారు. డెమోగ్రాఫిక్ అప్‌డేట్ అంటే పేరు, లింగం, పుట్టినతేదీ, చిరునామా, మొబైల్, ఈ మెయిల్ మార్పు వంటి వివరాలను మార్చడం, బయోమెట్రిక్ అప్‌డేట్‌తో పాటు చేస్తే ఉచితంగా ఉంటుందని, వేరుగా చేస్తే రూ.75 చార్జీ అవుతుందని పేర్కొన్నారు. డాక్యుమెంటరీ అప్‌డేట్ అంటే ఐడీ, చిరునామా డాక్యుమెంట్లు సమర్పించడం, మై ఆధార్ పోర్టల్ ద్వారా చేస్తే ఉచితమని తెలిపారు. ఎన్‌రోల్‌మెంట్ ద్వారా చేస్తే రూ. 75 చార్జీ అవుతుందని తెలిపారు. హోమ్ ఎన్‌రోల్‌మెంట్ సర్వీస్ కోసం రూ.700 ఫీజు ఉంటుందని పేర్కొన్నారు. ఒకే చిరునామా ఎక్కువ మంది తీసుకుంటే మొదటి వ్యక్తికి రూ. 700, మిగిలిన వారికి రూ. 350 చొప్పున చార్జ్ చేస్తారని తెలిపారు. ఆధార్ డౌన్‌లోడ్ చేసి ముద్రించుకోవడానికి రూ.40 చెల్లించాలని తెలిపారు. జిల్లా ప్రజలు ఆధార్ సంబంధిత సేవల కోసం అధికారిక ఆధార్ సేవా కేంద్రాలు, గుర్తింపు పొందిన సెంటర్లను మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. ప్రజల్లో ఎలాంటి అపోహలు లేకుండా సవరించిన చార్జీలపై విస్తృత ప్రచారం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

పట్టించుకోకుంటే సత్తా చూపిస్తా

ట్రైకార్ మాజీ చైర్మన్ తాటి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న తాటి వెంకటేశ్వర్లు

అశ్వారావుపేట : జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీని జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు తన సొంత ట్రస్టులా భావిస్తున్నారని.. పార్టీలోని కింది స్థాయి కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వకుంటే తన సత్తా చూపిస్తానని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, ట్రైకార్ మాజీ చైర్మన్ తాటి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను 1981 నుంచి రాజకీయాల్లో ఉన్నానని, పలు పార్టీల్లో క్రమశిక్షణగా పని చేశానని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఎన్నో ఆశయాలు, ఆకాంక్షలతో పార్టీని స్థాపించారని, కానీ జిల్లా పార్టీ పదవుల్లో ఉన్న వారు మూలాలను విడిచి నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. గత ఎన్నికల సమయంలో తాను బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరినా.. తనకు జరిగిన అవమానం తెలుసుకుని హరీష్‌రావు, కేటీఆర్ పిలిచి మళ్లీ పార్టీలో చేర్చుకున్నారని తెలిపారు. రేగా కాంతారావు, మెచ్చా నాగేశ్వరరావు ఒంటెద్దు పోకడలు మానుకోకుంటే తిరుగుబాటు తప్పదని అన్నారు. పార్టీ కేడర్‌కు తెలియజేయకుండా సమావేశాలు నిర్వహించడం సబబు కాదన్నారు. రేగా కాంతారావు అశ్వారావుపేటలో మీటింగ్ పెడితే తన సత్తా ఏంటో చూపిస్తానన్నారు. గతేడాది పెదవాగు ప్రాజెక్టు కట్ట తెగితే స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి బాధిత రైతులను పరామర్శించామని, పార్టీ పెద్దలను కూడా రావాలని కోరగా వారిని రానీయకుండా ఇన్‌చార్జ్‌లు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఇకనైనా కేడర్‌ను కలుపుకుని సమన్వయంతో నడవాలని సూచించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ సభ్యులు అంకత మల్లికార్జునరావు, మాజీ సర్పంచ్‌లు పొట్టా రాజులు, కారం ఎర్రయ్య, నల్లపు రామారావు తదితరులు ఉన్నారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



కల్యాణానికి హాజరైన భక్తులు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు


భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, ఆదివారం కావడంతో భక్తులు స్వామి వారిని పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. నిత్యకల్యాణంలోనూ భారీగా పాల్గొన్నారు.

గోశాల, శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం

శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో నిర్వహించే గోశాల, శాశ్వత నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన టీకే శ్వేత అనే భక్తురాలు గోశాలకు రూ.75,510, నిత్యాన్నదానానికి రూ.1,01,116 ఆలయ ఈఓ దామోదర్‌రావుకు అందజేశారు.

అందరి చూపూ.. ఆ రెండింటి వైపే

- దుమ్ముగూడెం, గుండాల జెడ్పీటీసీ స్థానాలు జనరల్
- ఇక్కడ గెలిస్తే జెడ్పీ చైర్మన్ బరిలో అవకాశం
- జిల్లా వ్యాప్తంగా డిమాండ్ పెరిగిన సీట్లు
- జనరల్‌కు కేటాయింపుపై ఆదివాసీ సంఘాల ఆగ్రహం



భద్రాచలం : స్థానిక సంస్థల ఎన్నికల వేళ దుమ్ముగూడెం, గుండాల జెడ్పీటీసీ సీట్లు హాట్ టాపిక్‌గా మారాయి. ఎప్పటి నుంచో ఎస్టీలకు రిజర్వ్‌డ్‌గా ఉన్న ఈ స్థానాలను ఈసారి జనరల్‌కు కేటాయించారు. ఇదే సమయంలో జిల్లా పరిషత్ చైర్మన్ పదవి సైతం జనరల్‌కు దక్కడంతో హేమాహేమీల దృష్టి దుమ్ముగూడెం, గుండాల వైపు మళ్లింది. జిల్లాలోని పలువురు సీనియర్ నాయకులు ఈ రెండు చోట్లా పోటీ చేసే అవకాశాన్ని పరిశీలిస్తున్నారు. మరోవైపు ఈ రెండు జెడ్పీటీసీ స్థానాలు జనరల్ కేటగిరీకి కేటాయించడంపై ఆదివాసీ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

చైర్మన్ పీఠానికి చాన్స్..

జిల్లాలోని గుండాల, దుమ్ముగూడెం జెడ్పీటీసీ స్థానాలు జనరల్, ఆళ్లపల్లి, టేకులపల్లి జనరల్ మహిళలకు కేటాయించారు. జెడ్పీ చైర్మన్ సీటు సైతం జనరల్‌కు రిజర్వ్ అయింది. దీంతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, జెడ్పీ సీటు ఆశిస్తున్న వారంతా దుమ్ముగూడెం, గుండాల జెడ్పీటీసీ స్థానాలపై దృష్టి సారించారు. తమకున్న రాజకీయ, ఆర్థిక బలాబలాలు, ఓట్ల శాతం ఇతర అంశాలపై స్థానిక నాయకులతో చర్చిస్తున్నారు. కాంగ్రెస్ నుంచి అశ్వాపురానికి చెందిన తూళ్లూరి బ్రహ్మయ్య పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఓట్ల సమీకరణల ప్రకారం ఆయన మొదటి ప్రాధాన్యత గుండాలకు, ఆ తర్వాత దుమ్ముగూడెం వైపు పరిశీలించే అవకాశం ఉందని అంటున్నారు. దుమ్ముగూడెం నుంచి టీపీసీసీ సభ్యులు బుడగం శ్రీనివాస్ సైతం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. వీరితో పాటు లక్ష్మీపురానికి చెందిన పీఏసీఎస్ మాజీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరెడ్డి, మాజీ జెడ్పీటీసీ తెల్లం సీతమ్మతో పాటు మరికొన్ని పేర్లు ప్రచారంలో ఉన్నాయి. ఇక కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా దుమ్ముగూడెం సీటు సీపీఐకి వస్తే స్థానికుడైన రావులపల్లి రవికుమార్‌కు దక్కే అవకాశం ఉంది. బీఆర్‌ఎస్ తరఫున రావులపల్లి రాంప్రసాద్ పేరు వినిపించినా.. ఆయనకు నియోజకవర్గ స్థాయి నాయకత్వ బాధ్యతలు ఉండడంతో సాగి శ్రీనివాసరాజును ఆ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వం ఇప్పటికే ఖరారు చేసింది. గుండాల జెడ్పీటీసీ రేసులో తూళ్లూరి బ్రహ్మయ్య కానట్టయితే టేకులపల్లికి చెందిన ఏలూరి కోటేశ్వరరావు పేరు వినిపిస్తోంది. మరో స్థానిక నాయకుడు ఎస్‌కే ఖదీర్ సైతం టికెట్ ఆశిస్తున్నారు. బీఆర్‌ఎస్ తరఫున పినపాకకు చెందిన భవానీ శంకర్, మోకాళ్ల వీరస్వామి పేర్లు ప్రచారంలో ఉన్నాయి.

టేకులపల్లి, ఆళ్లపల్లి జనరల్ మహిళలు..

టేకులపల్లి జెడ్పీటీసీ స్థానం జనరల్ మహిళకు కేటాయించగా.. ఇక్కడ పోటీ తీవ్రంగానే ఉంది. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గోనెల విజయలక్ష్మి మరిది కూతురు బండ్ల రజని, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తమ్ముడి సతీమణి కోరం ఉమ పేర్లు ప్రధానంగా వినిపిస్తుండగా, వీరితో పాటు గుండాల సుచరిత, ఆకారాపు స్వప్న, భూక్యా చంద్రకళ, భూక్యా గంగ తదితర పేర్లు కూడా వినిపిస్తున్నాయి. బీఆర్‌ఎస్ నుంచి ఇక్కడ అభ్యర్థిని ఖరారు చేయాల్సి ఉంది. ఆళ్లపల్లి జెడ్పీటీసీ సైతం జనరల్ మహిళకు రిజర్వ్ చేయగా కాంగ్రెస్ తరఫున బుర్రా వినోద పేరు దాదాపు ఖరారైనట్టుగా ప్రచారం సాగుతోంది. ఇక బీఆర్‌ఎస్ తరఫున ఎస్‌డీ షమీన్, మంజుభార్గవి, బూర్గంపాడు మాజీ జెడ్పీటీసీ కామినేని శ్రీలత పేర్లు వినిపిస్తున్నాయి.

చర్ల అభ్యర్థులు దాదాపు ఖరారు ?

చర్ల జెడ్పీటీసీ స్థానం బీసీ జనరల్‌కు కేటాయించారు. దీంతో భద్రాచలం డివిజన్ సీనియర్ నాయకులు, టీపీసీసీ సభ్యులు నల్లపు దుర్గాప్రసాద్‌ను కాంగ్రెస్ పార్టీ దాదాపు ఖరారు చేసే అవకాశం ఉంది. దుర్గాప్రసాద్ కాని పక్షంలో బండారు రామకృష్ణ పేరు పరిశీలనలో ఉంది. బీఆర్‌ఎస్ తరఫున పద్మశాలీ సామాజిక వర్గానికి చెందిన ఈర్ది కృష్ణమోహన్ పేరును పార్టీ నాయకత్వం పరిశీలిస్తోంది. ఇక సీపీఐ, సీపీఎం తదితర పార్టీలు ప్రకటించాల్సి ఉంది.

ఉద్యమ గుమ్మం నుంచే రణనినాదం

- చరిత్రలో నిలిచిపోయేలా సీపీఐ శత వసంతాల ముగింపు సభ
- ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశంలో వక్తలు
- హాజరైన కె.నారాయణ, పువ్వాడ, కూనంనేని



మాట్లాడుతున్న కె.నారాయణ, వేదికపై కూనంనేని, పువ్వాడ, వెంకటరెడ్డి తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: ఉద్యమ గుమ్మమైన ఖమ్మం నుంచే రణనినాదం మోగించడమే కాక పునరుత్తేజంతో కమ్యూనిస్టు పార్టీ విస్తరణకు కృషి జరగాలని సీపీఐ జాతీయ నాయకులు పిలుపునిచ్చారు. కమ్యూనిస్టులు లేని వ్యవస్థ మనజాలక పోగా, రానున్న కాలం కమ్యూనిస్టులదే అయినందున విస్తరణకు పునరంకితం కావడమే అందరి కర్తవ్యమని అన్నారు. సీపీఐ శత వసంతాల ముగింపు సభ డిసెంబర్ 26న జరగనున్న నేపథ్యాన ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశాన్ని ఆదివారం ఖమ్మంలో నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె.నారాయణ మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఖమ్మానికి ప్రత్యేక స్థానం ఉందని, ఆంధ్ర మహాసభ ద్వారా నైజాం పతనానికి నాంది పలికిన ఇక్కడ శత వసంత వేడుకల ముగింపు సభ జరగనుందని తెలిపారు. దేశవ్యాప్తంగా బహు పోరాటాలకు వేదికగా నిలిచిన కమ్యూనిస్టు పార్టీ ఇప్పుడు ప్రజాస్వామ్య వ్యవస్థల పరిరక్షణకు పునరంకితమవుతోందని తెలిపారు. ఇటీవల జరిగిన ఛండీఘర్ మహాసభ ఇదే పిలుపునిచ్చిందని నారాయణ గుర్తుచేశారు. కాగా, స్వాతంత్య్ర పోరాటంలోనూ, ఆ తర్వాత సామాజిక చైతన్యం కోసం జరిగిన ఏ పోరాటంతో సంబంధం లేని దేశద్రోహులు దేశభక్తులుగా చెలామణీ అవుతున్నారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని బీజేపీ ధ్వంసం చేస్తోందని, ఫెడరల్ స్ఫూర్తికి తిలోదకాలు ఇచ్చిందని పేర్కొన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మావోయిస్టులను తుదముట్టిస్తామని చెబుతుండగా.. మావోయిస్టులు అంతమైనా ఆ సిద్ధాంతం అంతం కాదని తేల్చిచెప్పారు. దేశాన్ని ముక్కలు కానివ్వమనే నినాదంతో పాటు గ్రామగ్రామాన కమ్యూనిస్టు పార్టీ విస్తరణే లక్ష్యంగా శత వసంత సభ నిర్వహిస్తామని నారాయణ తెలిపారు.

ఆర్‌ఎస్‌ఎస్‌ది అధికార కాంక్ష..

ఆర్‌ఎస్‌ఎస్‌ది అధికార కాంక్ష మాత్రమే కాక విభజన, విధ్వంసం మాత్రమేనని సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి తెలిపారు. సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టులు సైద్ధాంతిక నిర్మాణంతో రాజకీయ లక్ష్యం కోసం పనిచేస్తున్నారని చెప్పారు. బలహీనపడినా పునరుత్తేజం తథ్యమని తెలిపారు. కొందరు అలవికాని హామీలు, ధన ప్రభావం ఇతరత్రా కారణాలతో ఎన్నికల్లో సానుకూల ఫలితాలు సాధించి ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. కమ్యూనిస్టులే దేశానికి రక్ష, రాజకీయ ప్రత్యామ్నాయమని స్పష్టం చేశారు. సభకు అధ్యక్షత వహించిన కూనంనేని మాట్లాడుతూ త్యాగాల చరిత్రతో కమ్యూనిస్టులు ముందుకు సాగుతుంటే.. స్వార్థ చింతన, అధికార లక్ష్యంతో ఆర్‌ఎస్‌ఎస్ పనిచేస్తోందని అన్నారు. సీపీఐ సీనియర్ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావు, జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యులు టీఎం.మూర్తి, పుదుచ్చేరి రాష్ట్ర కార్యదర్శి సలీం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాగం హేమంతరావు తదితరులు మాట్లాడగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకులు చాడ వెంకటరెడ్డి, అజీజ్‌పాషా, అక్కినేని వనజ, ముప్పాల నాగేశ్వరరావు, జల్లి విల్సన్, రావుల వెంకయ్య, దండి సురేష్, ఎస్.కే.సాబీర్‌పాషా, నగర ప్రముఖులు ఎంఎఫ్.గోపీనాథ్, డాక్టర్ పి.గోర్కి, డాక్టర్ వై.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం



సర్టిఫికెట్, మెడల్‌తో మహా విష్ణుమూర్తి

కొత్తగూడెంటౌన్: మార్షల్ ఆర్ట్స్ విభాగంలో కొత్తగూడేనికి చెందిన కరాటే మాస్టర్ మాటూరి మహా విష్ణుమూర్తికి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు లభించింది. వరల్డ్ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దేశ వ్యాప్తంగా 980 మంది కరాటే మాస్టర్లు పాల్గొన్నారు. కాగా, మార్షల్ ఆర్ట్స్ విభాగంలో తనకు ఈ అవకాశం లభించిందని విష్ణుమూర్తి తెలిపారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధి రిషినాథ్ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నానని పేర్కొన్నారు.

చేపపిల్లల పంపిణీకి రంగం సిద్ధం

- ముగిసిన టెండర్ల ప్రక్రియ
- ఇద్దరు కాంట్రాక్టర్లకు అనుమతి



పాల్వంచరూరల్ : చెరువుల్లో చేప పిల్లల పంపిణీకి రంగం సిద్ధమైంది. చేప పిల్లల కొనుగోళ్ల టెండర్ల ప్రక్రియ శనివారం పూర్తి కాగా, జిల్లాలో నిర్దేశించిన జలవనరులకు సరఫరా చేసేందుకు ఇద్దరు కాంట్రాక్టర్లకు అనుమతి లభించింది. అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సమక్షంలో ఈ మేరకు ఖరారైనట్లు మత్స్యశాఖ అధికారి ఎండీ.ఇంతియాజ్ అహ్మద్ ఖాన్ తెలిపారు. చేప పిల్లల సరఫరాకు సంబంధించిన అనుమతి కోసం మత్స్యశాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అనుమతి రాగానే నిర్దేశించిన చెరువులు, కుంటల్లో చేప పిల్లలు వదులుతామని పేర్కొన్నారు.

జిల్లాలో 1.76 కోట్ల పిల్లలు..

జిల్లాలో 734 చెరువులు ఉండగా, ఈ ఏడాది సమయం లేనందున 600 చెరువుల్లో చేప పిల్లలను పోయనున్నట్లు మత్స్యశాఖాధికారి తెలిపారు. ఇందులో చెరువుల్లో నీటి సామర్థ్యం, విస్తీర్ణం ఆధారంగా చిన్న, పెద్ద సైజు పిల్లలను పంపిణీ చేయనున్నారు. 80 నుంచి 100 మి.మీ.సైజులో 86 లక్షల పిల్లలకు ఒక్కో పిల్లకు రూ.1.49 పైసల చొప్పున, 35 – 40 మి.మీ. సైజ్ 90 లక్షల పిల్లలకు 56 పైసల చొప్పున పంపిణీ చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకొచ్చారు. ఫైనల్ టెండర్ల ప్రక్రియ పూర్తి కావడంతో ఇద్దరు కాంట్రాక్టర్ల ద్వారా చేపపిల్లల సరఫరాకు మత్స్యశాఖ కమిషనర్ అనుమతి కోసం ప్రతిపాదనలు పంపారు. అక్కడి నుంచి అనుమతి రాగానే జిల్లాలోని నిర్దేశించిన చెరువులు, కుంటల్లో చేప పిల్లల పంపిణీ చేయనున్నారు.

క్లుప్తంగా

కిన్నెరసాని నీటి విడుదల



కిన్నెరసాని నుంచి వదులుతున్న వరద నీరు

పాల్వంచరూరల్: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో కిన్నెరసాని జలాశయంలో నీటిమట్టం పెరుగుతోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 407 అడుగులు కాగా, 1600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండటంతో ఆదివారం నీటిమట్టం 406.60 అడుగులకు పెరిగింది. దీంతో ప్రాజెక్‌కు చెందిన ఒక గేటును ఎత్తి ఉంచి 3 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

జిల్లా బాక్సింగ్ జట్ల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

కొత్తగూడెంటౌన్: అండర్–14, 17 విభాగాల్లో జిల్లా బాలబాలికల బాక్సింగ్ జట్లను ఎంపిక చేశారు. ఆదివారం కొత్తగూడెం సీఈఆర్ క్లబ్‌లో ఎంపికలు నిర్వహించారు. అండర్–14 బాలుర విభాగంలో ఆర్.గణేష్, కె.ధనుష్, టి. మణికంఠ, కె. పార్థు, వి.తనుష్, తేజస్, అబ్దుల్ హాసన్, వి.సాయి కిరణ్ ఎంపికయ్యారు. అండర్ –17 విభాగంలో కె.అరుణ్‌కృష్ణ, షేక్ అరహాన్ ఆలీ, వి.భార్గవ్ తేజా, సయ్యద్ అబ్దుల్ మాలిక్‌లను ఎంపిక చేశారు. అండర్–17 బాలికల విభాగంలో టి.హాసిని, బి. రూప, కె.హారిక, బి.జాహ్నవి, ఖ్యాతి భువన శ్రీ, కె.సానియాలు అర్హత సాధించినట్లు నిర్వాహకులు మట్టపర్తి రమేష్ తెలిపారు. స్కూల్ గేమ్స్ సెక్రటరీ నరేష్ ఎంపికలను పర్యవేక్షించగా, కోచ్ మట్టపర్తి మానస, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భారీ కొండచిలువ పట్టివేత



ఐడీఓసీ సమీపంలో పట్టుకున్న కొండచిలువ

పాల్వంచ: బీసీఎం రోడ్‌లోని కలెక్టరేట్(ఐడీఓసీ) సమీపంలో శనివారం రాత్రి 12 అడుగుల కొండ చిలువ కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. స్థానికుల సమాచారంతో ఫారెస్ట్ అధికారులు, మున్సిపల్ స్నేక్ రెస్క్యూ స్పెషలిస్ట్ సంతోష్ అక్కడికి చేరుకుని కొండచిలువను పట్టుకుని, అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి వదిలారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్లు రామ్ ప్రసాద్, భావ్‌సింగ్, సిబ్బంది గణేష్, శ్రీకాంత్, మహేష్, ఏడు కొండలు పాల్గొన్నారు.

భారీ వర్షంతో కూలిన వృక్షాలు



వినాయకపురం–మామిళ్లవారిగూడెం రహదారిపై అడ్డంగా పడిన వృక్షం

అశ్వారావుపేటరూరల్: మండల వ్యాప్తంగా ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతోపాటు గాలివాన రాగా మండలంలోని వినాయకపురం–మామిళ్లవారిగూడెం ప్రధాన రహదారిపై రాత్రి పలుచోట్ల వృక్షాలు విరిగిపడ్డాయి. రహదారికి అడ్డంగా చెట్లు పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. అశ్వారావుపేట పట్టణంలోని ప్రధాన, అంతర్గత మార్గాలు జలమయమయ్యాయి.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి



మృతి చెందిన గేదె

ఇల్లెందురూరల్: మండలంలోని సత్యనారాయణపురం రైతు చింతిరాల వీరభద్రానికి చెందిన రెండు గేదెలు ఆదివారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. తిలక్‌నగర్ సమీపంలో 11కేవీ త్రీఫేస్ విద్యుత్ లైన్ తీగలు తెగి కింద పడి ఉండగా, మేత కోసం వచ్చిన గేదెలు విద్యుదాఘాతానికి గురై చనిపోయాయి. గమనించిన పశువుల కాపర్లు మిగతా గేదెలను అటు వైపు రాకుండా మళ్లించారు. సుమారు రూ.80 వేల వరకు నష్టం వాటిల్లిందని, ప్రమాద ఘటనపై ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేశానని రైతు వీరభద్రం తెలిపారు.

చేరువగా 'కేంద్రీయ' విద్య

జిల్లాకు విద్యాలయను మంజూరు చేసిన కేంద్రం

- విద్యార్థులకు సీబీఎస్‌ఈ సిలబస్ బోధన అందుబాటులోకి..
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభం



ప్రస్తుతం కేంద్రీయ పాఠశాల కార్యకలాపాలు నిర్వహించేది ఈ పాఠశాల నుంచే..

కొత్తగూడెం అర్బన్: కేంద్రీయ విద్యాలయ మంజూరుతో జిల్లా ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. పిల్లలకు ఉన్నతమైన, నాణ్యమైన విద్య అందే అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి పార్లమెంట్‌లో లేవనెత్తడంతోపాటు కేంద్ర ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేయడంతో విద్యాలయ మంజూరైంది. కొత్తగా నాలుగు విద్యాలయాలు మంజూరు కాగా, అందులో ఒకటి జిల్లాకు కేటాయించారు. కేంద్రీయ విద్యాలయలో ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు కూడా విద్యనభ్యసించే అవకాశం ఉంటుంది. సీబీఎస్‌ఈ సిలబస్ బోధిస్తారు. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో సీబీఎస్‌ఈ సిలబస్‌కు సంబంధించి విద్యను అభ్యసించాలంటే రూ.లక్షల్లో ఖర్చు చేయాల్సి ఉంటుంది. పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకోలేని పరిస్థితి ఉంది. ఈ క్రమంలో కేంద్రీయ విద్యాలయ మంజూరు కావడంతో పేద, మధ్య తరగతి ప్రజల్లో హర్షం వ్యక్తం అవుతుండగా, వచ్చే విద్యా సంవత్సరం నుంచి బోధన జరుగనుంది.

నామినల్ ఫీజులతో ప్రవేశాలు

కేంద్రీయ విద్యాలయలో ఆన్‌లైన్ పద్ధతిలో నామినల్ ఫీజులతో అడ్మిషన్లు నిర్వహిస్తారు. సీబీఎస్‌ఈ విద్య కోసం ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లు, కళాశాలల్లో రూ. లక్షల్లో ఫీజులు కట్టాల్సిన పరిస్థితి ఉండదు. జిల్లాలో నియోజకవర్గానికో ఇంటిగ్రేటెడ్‌స్కూల్ మంజూరైంది. ఆ స్కూళ్లకు సంబంధించి ఇంకా గ్రౌండ్ వర్క్ కొనసాగుతోంది. ప్రస్తుతం కేంద్రీయ విద్యాలయ కూడా రావడంతో జిల్లాలోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే అవకాశం ఉంది.

నిర్మాణానికి స్థల పరిశీలన..

కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు రామవరం, లక్ష్మీదేవిపల్లి మండలం పాలకేంద్రంలోని రెండు ఎకరాల స్థలాలను కేంద్ర బృందం పరిశీలించింది. ఏ స్థలాన్ని కూడా ఖరారు చేయకపోవడంతో మరోసారి స్థల పరిశీలన జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పాలకేంద్రంలోని స్థలం విద్యాలయ నిర్మాణానికి అనుకూలంగా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. అప్పటివరకూ కొత్తగూడెంలోని తెలంగాణ స్కూల్‌లో విద్యాలయకు సంబంధించిన కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు జిల్లా విద్యాశాఖాధికారులు అనుమతులు ఇచ్చారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోగా భవనాల నిర్మాణం పూర్తయితే నూతన భవనంలోనే విద్యాలయను కొనసాగించనున్నారు. లేకపోతే తెలంగాణ స్కూల్‌లో క్లాసులు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు, పర్యవేక్షణ, నిధులు మంజూరు తదితర కార్యకలాపాలు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోనే జరుగుతాయి.

పాన్‌మసాలా తయారీలో కలప!

- ఉత్తరాది రాష్ట్రాల్లో రెండు ఫ్యాక్టరీలు సీజ్
- మహబూబాబాద్ కేంద్రంగా సంద్ర కలప అక్రమ రవాణా
- దందాపై విచారణలో గుర్తించిన అధికారులు

ఖమ్మంవ్యవసాయం: ఉత్తరాది రాష్ట్రాలకు అక్రమ కలప రవాణా వ్యవహారంపై చేపడుతున్న విచారణలో ఆసక్తికరమైన అంశాలు బయటపడుతున్నాయి. 'నేషనల్ ట్రాన్సిట్ పర్మిట్'(ఎన్టీపీసీ) పేరిట తెలంగాణ నుంచి అనుమతి ఉన్న కలప మాటున విలువైన కలపను కొంత కాలంగా రవాణా చేస్తున్నారు. సర్కారీ తుమ్మ కలప మాటున 'సంద్ర' కలపను రవాణా చేస్తుండగా మధ్యప్రదేశ్‌లో అక్కడి అటవీ అధికారులు గుర్తించి జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు విచారణ చేపట్టిన అధికారులు సంద్ర కలపను ఉత్తరాది రాష్ట్రాల్లో పాన్ మసాలా తయారీలో వినియోగిస్తున్నట్లు గుర్తించారు. అటవీ జాతుల వృక్షాలు, మొక్కలు లేని చింతకాని ప్రాంతం నుంచి నేషనల్ ట్రాన్సిట్ పర్మిట్ విధానంలో 44 జాతుల కలపకు ఆన్‌లైన్‌లో ఎన్‌ఓసీ తీసుకున్నట్లు తేల్చారు. ఇందులో సర్కారీ తుమ్మ కలప కూడా ఉండగా ఆ స్థానంలో భారీగా సంద్ర జాతి కలపను మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, హరియాణా రాష్ట్రాలకు తరలించినట్లు బయటపడింది.

మూడు జిల్లాల్లో వృక్షాలు

అనుమతి పేరిట 'సంద్ర' కలప మహబూబాబాద్ జిల్లా కేంద్రంగా అక్రమంగా తరలిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. ఇప్పటికే మహబూబాబాద్‌నుంచి కలప రవాణా చేసిన వాహనాన్ని గుర్తించి సీజ్ చేశారు. మహబూబాబాద్ రిజర్వ్ ఫారెస్ట్ నుంచి భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల వరకు అనేక ప్రాంతాల్లో సంద్ర జాతి వృక్షాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల నుంచి సంద్ర జాతి కలపను సేకరించి సర్కారీ తుమ్మ లభించే ప్రాంతాల పేరిట పర్మిట్లను సృష్టించి ఉత్తరాది రాష్ట్రాలకు కలప రవాణా చేస్తున్నట్లుగా తేల్చారు.

పాన్ మసాలా ఫ్యాక్టరీలు సీజ్

మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, హరియాణా, గుజరాత్ రాష్ట్రాల్లో పాన్‌మసాలా తయారీ ఫ్యాక్టరీలు ఉండగా.. అందులో సంద్ర కలప ఉత్పత్తులను వినియోగిస్తున్నారు. తొలుత జమ్మూకాశ్మీర్ ప్రాంతాల నుంచి కలప దిగుమతి చేసుకునేవారు. అక్కడితో పోలిస్తే తెలంగాణ ప్రాంతంలోని సంద్ర కలప మరింత మంచిదని గుర్తించిన యాజమాన్యాలు ఇక్కడి దళారులతో ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. ఇక్కడి వ్యాపారులు సర్కారీ తుమ్మ మాటున 'సంద్ర' కలపను అక్రమ రవాణా చేస్తుండగా.. అటవీ అధికారులు రెండు ఫ్యాక్టరీలను సీజ్ చేశారు.

టేకు కన్నా సంద్రకే డిమాండ్

ఉత్తరాది రాష్ట్రాల్లో టేకు కన్నా సంద్ర కలపకు డిమాండ్ ఎక్కువ. దీంతో అనుమతి ఉన్న కలప మాటున అనుమతులు లేని సంద్ర కలప తెలంగాణ నుంచి రవాణా చేస్తున్నట్లు గుర్తించాం. మధ్యప్రదేశ్, మహారాష్ట్రాల అటవీ శాఖల అధికారులు కలప రవాణాపై నిఘా వేసి రెండు పాన్ మసాలా ఫ్యాక్టరీలను సీజ్ చేశారు. మహబూబాబాద్ కేంద్రంగా రవాణాకు ఉపయోగించిన ఓ వాహనం కూడా పట్టుబడింది. నిర్మల్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలపై కూడా అటవీ శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించారు. – సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, ఖమ్మం జిల్లా అటవీ శాఖాధికారి

సిల్క్ వస్త్రంపై 'సీతారాములు'



సీతారాముల చిత్రాన్ని గీస్తున్న ముక్తేశ్వర్

భద్రాచలంఅర్బన్: సిల్క్ క్లాత్ పట్టుకుంటేనే జారిపోతుంది. అలాంటి బట్టపై ఓపికతో సీతారాముల చిత్రాన్ని వేసి తన భక్తిని చాటుకున్నాడు భద్రాచలానికి చెందిన దారా ముక్తేశ్వర్. బీటెక్ పూర్తి చేసిన ఇతను భద్రాద్రి రాములవారి కల్యాణోత్సవం సందర్భంగా వినియోగించే అడ్డుతెరపై చిత్రాన్ని ఆర్కిలిక్ పెయింట్స్‌తో గీసిన చిత్రం ఎంతో ఆకర్షణగా నిలిచింది. దాదాపు పది రోజుల 30 గంటలపాటు శ్రమించినట్లు తెలిపాడు. గతంలో రామాలయం చిత్రాన్ని గీశాడు. 3 సెంటీ మీటర్లతో అతి చిన్న మట్టి వినాయకుడి విగ్రహాన్ని తయారు చేశాడు.

ఏటీఎంలో చోరీ యత్నం

పోలీసుల రాకతో దుండగుడు పరార్



సీసీ కెమెరాలోనమోదైన నిందితుడి దృశ్యం

ములకలపల్లి: ములకలపల్లిలో ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి దుండగుడు విఫలయత్నం చేశాడు. పోలీసులు కథనం ప్రకారం.. శనివారం అర్ధరాత్రి పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఎస్‌బీఐ ఏటీఎంలో లైట్లు ఆఫ్ చేసి ఉండటంతో అనుమానం వచ్చిన పోలీసులు కారు దిగుతుండగా, ఏటీఎంలో ఉన్న దుండగుడు గమనించి పరారయ్యాడు. నగదు కోసం ఏటీఎంను పగులగొడుతున్నట్లు సీసీ కెమెరాలో రికార్డయింది. ఏటీఎం తెరుచుకోకపోవడంతో నగదు చోరీకి గురికాలేదు. నిందితుడు లేతపచ్చరంగు పాలిథీన్ కవర్ ధరించి ఉన్నాడు. కొత్తగూడెం క్లూస్‌టీం సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఘటనా ప్రదేశాన్ని సందర్శించి, వేలిముద్రలు, ఇతర ఆధారాలు సేకరించారు. ఎస్‌బీహెచ్ మేనేజర్ పుల్లారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుప్రసాద్ తెలిపారు.

ఆర్టీసీ ప్రయాణికుల పాట్లు



బస్టాండ్‌లో కిటకిటలాడుతున్న ప్రయాణికులు

- దసరా పండుగ ముగియడంతో తిరుగుముఖం
- ఇల్లెందులో తగిన సంఖ్యలో లేని బస్సులు

ఇల్లెందు: దసరా పండుగ అనంతరం తిరిగి వెళ్తున్న ప్రయాణికులతో ఇల్లెందు బస్టాండ్ కిటకిటలాడుతోంది. ఆదివారం బస్టాండ్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు రద్దీ కనిపించింది. తగిన సంఖ్యలో బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ఇక్కట్లు పాలయ్యారు. పండుగతోపాటు గుండాలలో నాలుగు రోజులపాటు శ్రీ మహాలక్ష్మీ దేవి ఆలయంలో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరిగాయి. దీంతో వివిధ ప్రాంతాల్లో ఉంటున్నవారంతా స్వగ్రామానికి చేరుకున్నారు. దసరాకు వచ్చినవారు, అమ్మవారి వేడుకలకు వచ్చినవారు తిరిగి వెళ్తుండటంతో బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసింది. ఇల్లెందు నుంచి గుండాల, మహబూబాబాద్, ఖమ్మం, కొత్తగూడెం ప్రాంతాలకు సరిపడా బస్సులు లేవని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్, మణుగూరు, గోదావరిఖని, వేములవాడ, భూపాలపల్లి, హనుమకొండ, భద్రాచలం ప్రాంతాలకు వెళ్లే బస్సులు చాలా ఆలస్యంగా వచ్చాయని తెలిపారు. దీంతో కొందరు ప్రైవేట్ వాహనాల్లో వెళ్లారు. కాగా పండగలు వస్తే కనీసం భోజనం చేసే తీరిక కూడా ఉండటం లేదని డ్రైవర్లు, కండక్టర్లు అంటున్నారు. బస్టాండ్లలో నిలిపిన బస్సుల్లోనే భోజనాలు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రయాణికుల ఇక్కట్లపై డిపో అసిస్టెంట్ మేనేజర్ సునీతను వివరణ కోరగా.. డిపోలో ఒక్క బస్సు కూడా ఉండటం లేదని, అన్ని బస్సులు రూట్లలోనే తిరుగుతున్నాయని తెలిపారు.

'స్థానికం'పై విప్లవ పార్టీల చర్చలు

ఇల్లెందు: స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసి పోటీ చేసేందుకు రెండు విప్లవ పార్టీల మధ్య చర్చలు సాగుతున్నాయి. ఎన్డీ మధు వర్గం, ప్రజాపంథా మాస్‌లైన్ పార్టీల మధ్య రెండు దఫాలుగా చర్చలు జరగగా, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ స్థానాలపై ఏకాభిప్రాయం కుదరలేదు. మొదటి దఫా రొంపేడులో, సోమవారం రెండో దఫా పోలారంలో చర్చలు జరిపారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో పోటీ చేసే బలం తమకే ఉందని ఇరు వర్గాలు పట్టుబట్టాయి. గుండాల, ఇల్లెందు, టేకులపల్లి మండలాల్లో బలంగా ఉన్న చోట ఈ పార్టీలు పోటీ చేయాలని నిర్ణయించాయి. మెజారిటీ స్థానాల్లో తాము పోటీ చేస్తామని, తమకు మద్దతు ఇవ్వాలని మాస్‌లైన్‌ను ఎన్డీ కోరినట్లు తెలిసింది. చెరి సగం స్థానాల్లో పోటీ చేసేందుకు ఆమోదయోగ్యమైతే పొత్తుకు సై అన్నట్లు తెలిసింది. చర్చల్లో ఎన్డీ నాయకులు జే.సీతారామయ్య, ముక్తి సత్యం, కోరం సీతారాములు, గౌని నాగేశ్వరరావు, తుపాకుల నాగేశ్వరరావు, మాస్‌లైన్ నాయకులు ఎస్.రాజు, ఈసం శంకర్, బుర్ర వెంకన్న, వై.సావిత్రి, పృథ్వీ, యాకుబ్‌షావలీ తదితరులు పాల్గొన్నారు.

గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

ఇల్లెందు: మండలంలోని కరెంటాఫీసు వద్ద శనివారం రాత్రి పోలీసులు గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని జగదాంబ సెంటర్‌కు చెందిన కిరాణా వ్యాపారి అన్నవరపు వెంకటేశ్వర్లు 35 బ్యాగుల గుట్కా ప్యాకెట్లు, 60 అంబర్ ప్యాకెట్లు రవాణా చేస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్‌ఐ గని తెలిపారు. కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

కమ్యూనిస్టులతోనే దేశ భవిష్యత్

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని



మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వీరభద్రం

బోనకల్: కమ్యూనిస్టులపైనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని, వారు లేకపోతే పరిస్థితులు మరింత ప్రమాదకరంగా మారతాయని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం తెలిపారు. బోనకల్ మండలం గోవిందాపురం(ఎల్)లో సీపీఎం నాయకుడు మాదినేని నారాయణ కుమారుడు, రిటైర్డ్ జడ్జి మాదినేని రాధాకృష్ణ మృతిచెందగా ఆయన కుటుంబాన్ని ఆదివారం తమ్మినేని పరామర్శించి మాట్లాడారు. ప్రస్తుత రాజకీయాలు డబ్బు, పదవుల చుట్టే తిరుగుతుండడం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. కమ్యూనిస్టులు ఇప్పుడు బలంగా లేకున్నా, భవిష్యత్ మాత్రం కమ్యూనిస్టులదేనని చెప్పారు. కమ్యూనిస్టులను హేళన చేసే వారికి సమాధానం చెప్పే రోజు దగ్గరలోనే ఉందని తెలిపారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు, సీపీఎం, కాంగ్రెస్ నాయకులు మడిపల్లి గోపాల్‌రావు, పొన్నం వెంకటేశ్వరావు, పైడిపల్లి కిషోర్‌కుమార్, గాలి దుర్గారావు, మోదుగు సుధీర్‌బాబు తదితరులు సైతం రాధాకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

దాడి ఘటనలో కేసు నమోదు

ఇల్లెందు: దాడి ఘటనలో ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణానికి చెందిన మునలయ్య, అతని కుమారుడు కలిసి తనతోపాటు తన కుటుంబ సభ్యులను అకారణంగా దూషించి, దాడి చేశారని మల్లిపెద్ది కమలాకర్ అనే వ్యక్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

మణుగూరు టౌన్: మండలంలోని పగిడేరు గ్రామానికి చెందిన వ్యక్తి శనివారం రాత్రి పేరంటాల చెరువులో గల్లంతు కాగా, ఆదివారం మృతదేహం లభ్యమైంది. స్థానికుల కథనం ప్రకారం.. మల్లూరుకు చెందిన గోడ చరణ్(28) తన అత్తగారి ఇంటి వద్ద పగిడేరులో నివాసం ఉంటున్నాడు. శనివారం రాత్రి ఇద్దరు మిత్రులతో కలిసి సమీపంలోని పేరంటాల చెరువులో చేపల వేటకు వెళ్లాడు. వల వేస్తున్న క్రమంలో చరణ్ గల్లంతయ్యాడు. అతనితో వెళ్లిన మిత్రులు కుటుంబసభ్యులకు తెలపగా, రాత్రివేళ గాలించినా ప్రయోజనం లేకపోయింది. ఆదివారం పోలీసుల సహకారంతో గాలింపు చర్యలు చేపట్టగా, చరణ్ మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆయిల్‌ఫెడ్‌లో అవకతవకలపై దర్యాప్తు జరపాలి



సదస్సులో మాట్లాడుతున్న రంగారెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: ఆయిల్ ఫెడ్ సంస్థలో జరుగుతున్న అవకతవకలపై సమగ్ర దర్యాప్తు జరిపించి నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని మాజీ ఎమ్మెల్యేజూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఆయిల్ పామ్ రైతుల రాష్ట్రస్థాయి సదస్సు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుంబూరు మహేశ్వరరెడ్డి అధ్యక్షతన ఆదివారం ఖమ్మంలో జరగగా రంగారెడ్డి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్‌పామ్ పామాయిల్ సాగు విస్తీర్ణం పెంపుపై దృష్టి సారించినా ఆ స్థాయిలో రైతులకు సలహాలు అందడం లేదన్నారు. అంతేకాక రైతులకు ఇబ్బందులు తలెత్తినప్పుడు బాధ్యతతో వ్యవహరించడం లేదని చెప్పారు. టన్నుకు కనీస మద్దతు ధర రూ.25 వేలు చెల్లించాలని, ఆయిల్ ఫెడ్ ద్వారా సరఫరా చేసిన మొక్కలు పెరగక నష్టోయిన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావించాలని కోరారు. రైతు సంఘం నాయకులు తుంబూరు మహేశ్వరరెడ్డి, బొంతు రాంబాబు మాట్లాడగా కొకెరపాటి పుల్లయ్య, కారం శ్రీ రాములు, రావు జోగిబాబు, చేలికాని వెంకట్రావు, దొడ్డ చక్రధర్‌రెడ్డి, బుచ్చన్న, గురువారెడ్డి, సంగీతరెడ్డి, చలపతిరావు, ధనమ్మ, పాషా, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య



కిషోర్(ఫైల్)

అశ్వాపురం: మండల పరిధిలోని అమెర్ద కాలనీ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కరటూరి కిషోర్(38) శనివారం పురుగుల మందు తాగగా, కుటుంబసభ్యులు అశ్వాపురం పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి భద్రాచలం, ఆ తర్వాత ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దసరా పండుగకు అత్తవారింటికి వెళ్లగా, అక్కడి గొడవ జరగడంతో కిషోర్‌ను కొట్టారని, తిరిగి ఇంటికి వచ్చాక మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తల్లి ఫిర్యాదు చేసింది. సీఐ అశోక్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేటీపీఎస్ ఆర్టిజన్..

పాల్వంచ: ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో మూడు రోజుల క్రితం పురుగుల మందు తాగిన కేటీపీఎస్ ఆర్టిజన్ కార్మికుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. నవ భారత్ గాంధీనగర్‌కు చెందిన శాంపూరి ప్రవీణ్‌కుమార్ (45) కేటీపీఎస్‌లో ఆర్టిజన్‌గా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో ఈ నెల 3న పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో ..

ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రానికి చెందిన యువకుడు కుటుంబ కలహాల కారణంగా బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఖమ్మం సారథినగర్‌లో నివాసముండే మాదాసు సాయితేజ(19) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన తండ్రి ఓ హత్య కేసులో జీవిత ఖైదు అనుభవిస్తుండగా... పిల్లలను తల్లి వదిలివేసి వెళ్లింది. దీంతో సాయితేజ సోదరి పెళ్లిని బంధువులు జరిపించారు. అయితే, ఇటీవల ఇంటి నుంచి వెళ్లిపోయిన తల్లి తిరిగి రావడం, మద్యం మత్తులో సాయి గొడవ పడుతుండడంతో అందరూ వెళ్లిపోయారు. ఆపై పెద్దమ్మ కవిత ఇంటి వద్ద ఉంటున్న సాయితేజ శనివారం రాత్రి అమ్మవారి శోభయాత్ర ముగిశాక తమ సొంతింటికి వెళ్లి ఉరి వేసుకున్నాడు. ఆదివారం ఆయన పెద్దమ్మ ఈ విషయాన్ని గుర్తించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని ఖమ్మం త్రీటౌన్ సీఐ మోహన్‌బాబు తెలిపారు.

పాముకాటుతో మహిళ మృతి

నేలకొండపల్లి: ముదిగొండ మండలం పమ్మి గ్రామానికి చెందిన జె.రాధ నేలకొండపల్లి మండలం అనాసాగారంలో ఆదివారం కూలికి వచ్చింది. చేలో పత్తి తీస్తుండగా పాము కాటేయడంతో మిగతా కూలీలు నేలకొండపల్లి ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి



వంశీ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

మధిర: మధిర పెద్ద చెరువులో ఈతకు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందాడు. ఏపీలోని ఎన్టీఆర్‌జిల్లా గంపలగూడెం మండలం తునికిపాడుకు చెందిన ఇలవరపు వంశీ (21) తన స్నేహితులతో కలిసి ఆదివారం మధిర పెద్దచెరువులో ఈతకు వెళ్లాడు. పూర్తిస్థాయిలో ఈతరాని ఆయన వంశీ ప్యాంట్‌తో పాటే చెరువులోకి దిగాక కాసేపటికి ఆయాసంతో ఒడ్డుకు చేరలేకపోయాడు. ఈ సమయాన నీటిలో మునుగుతున్న ఆయనను కాపాడేందుకు స్నేహితులు యత్నించినా ఫలితం కానరాలేదు. సమాచారం అందుకున్న స్విమ్మర్స్ అసోసియేషన్ సభ్యులు నాలుగుగంటల పాటు శ్రమించి అతని మృతదేహాన్ని వెలికితీశారు. అయితే, గాలింపు కొనసాగినంత సేపు వంశీ ప్రాణాలతో బయటకు వస్తాడని ఎదురు చూసిన కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. కాగా, ఆయన సంజీవరావు – మరియమ్మ దంపతుల్లో నలుగురి సంతానంలో వంశీ ఒక్కడే కుమారుడు కాగా ల్యాబ్ టెక్నీషియన్ కోర్స్ చదువుతున్న ఆయన మృతితో కుటుంబంలో విషాదం నెలకొంది.

విరిసిన 'హరివిల్లు'



ములకలపల్లిలో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. అనంతరం ఆకాశంలో హరివిల్లు విరిసింది. చెదిరిపోతున్న మేఘాల నడుమ సగం మాత్రమే కనిపించిన ఇంద్ర ధనస్సు చూపరులను ఆకర్షించింది. –ములకలపల్లి